క్లుప్తంగా

సమస్యలపై పోరాడాలి



హరీశ్‌రావుతో శాంతకుమార్

నవాబుపేట: బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతకుమార్ బుధవారం బీఆర్‌ఎస్ నేత సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు మంచి రోజులు రానున్నాయని నిత్యం ప్రజల్లో ఉండి ప్రజాసమస్యలపై పోరాడాలని హరీశ్‌రావ్ తెలిపారన్నారు.

రైతుల పాట్లు!

- శనగ పంటకోసం పొలం చుట్టూ కంచెవేసి అడ్డుగా చీరలు..
- జంతువులనుంచి కాపాడుకునేందుకు తంటా



ఎన్కేపల్లిలో సాగు చేస్తున్న శనగ పంట

మోమిన్‌పేట: రైతులు సాగు చేస్తున్న పంటలను జంతువులు, అడవి పందులు, నెమలుల నుంచి కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. పంట పొలాల చుట్టూ చీరలు అడ్డుగా కడుతున్నారు. మందులను స్ప్రే చేయడం, సోలార్ ఫెన్సింగ్ లాంటివి చేస్తున్నారు. ఇదే తరహాలో మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ రైతు నాగయ్య తన శనగ పంటను కాపాడుకునేందుకు, నెమలులు శనగ ఆకును తినకుండా పొలంలో కర్రలకు గుడ్డలు, చీరలు, కట్టి నిలబెట్టాడు. గాలి వీయడం వల్ల వచ్చే శబ్దంతో నెమలులు రావడం లేదంటున్నాడు. అడవి పందుల నుంచి రక్షణగా పాలి హౌజ్ కవర్లను పొలం చుటూ కట్టాడు. ఇలా అడవి జంతువుల నుంచి రైతులు పంటలను కాపాడుకొంటున్నారని చెబుతున్నారు.

నూతన సంవత్సరం.. పోటెత్తిన భక్తులు



అనంతగిరి: ఆలయ పరిసరాల్లో భక్తుల కోలాహలం

అనంతగిరి: నూతన సంవత్సరం పురస్కరించుకుని భక్తులు, పర్యాటకులతో అనంతగిరి గుట్ట పోటెత్తింది. ఇందులో భాగంగా ఉదయం కుటుంబీకులు, స్నేహితులతో వచ్చి ముందుగా అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. దర్శనం అనంతరం ఆలయ పరిసరాల్లో కలియతిరిగారు.

కిటకిటలాడిన దేవాలయాలు

దుద్యాల్: నూతన సంవత్సరం మొదటి రోజు కావడంతో బుధవారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని పోలేపల్లిలో ఎల్లమ్మ తల్లి, చిలుముల మైల్వార్ మామిడికుంట ఆంజనేయ స్వామి దేవాలయలు ప్రసిద్ధి గాంచినవి. ఆయా దేవాలయాలకు చుట్టు పక్కల మండలాలైన కొడంగల్, కోస్గి, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల నుంచి ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు. కొత్త సంవత్సరం మొదటి రోజు దేవుళ్లను దర్శించుకుంటే ఏడాది మొత్తం బాగుంటుందనే నమ్మకం.

నేడు అయ్యప్ప పడిపూజ

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రాంలోని శంబులింగేశ్వరస్వామి దేవాలయం వద్ద గురువారం అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ మహా పడిపూజకు అయ్యప్ప స్వాములు, నాయకులు, భక్తులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

దళిత కుటుంబాలకు అండగా ఉంటా

దోమ: గ్రామంలోని ప్రతీ దళిత కుటుంబానికి తాము అండగా ఉంటామని దళిత సంఘం నేతలు అన్నారు. బుధవారం బొంపల్లి గ్రామంలో అప్పగాళ్ల శ్యామలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వారు మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15వేలు సాయం అందజేశారు. అంతకు ముందు కాంగ్రెస్ నేతలు రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నేతలు ఆర్.రాములు, టి.శ్రీనివాస్, మహేశ్, జంగయ్య, రాములు, వెంకటేశ్, రాజు, నర్సింహులు, మహేశ్‌లక్కీ, కృష్ణ, రమేశ్, జగన్, వెంకటయ్య, శ్రీను, రాము, అశోక్, అనిల్ పాల్గొన్నారు.

వంద శాతం లక్ష్యం

- 'పది'లో ఫలితాల కోసం కృషి
- పూర్తయిన సెలబస్ ప్రారంభమైన రివిజన్
- పర్యవేక్షిస్తున్న మండల విద్యాధికారులు



స్టడీహవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

దుద్యాల్: పదోతరగతిలో వందశాతం లక్ష్యం కోసం ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు వంద రోజుల ప్రణాళిక అమలుచేస్తున్నారు. మార్చి 21 నుంచి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. మరో వైపు పాఠ్యాంశాలు పూర్తి చేసి, రివిజన్ చేయించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల ఆధారంగా గ్రేడులుగా విభజించి ఏ సబ్జెక్టులో ఎవరెవరు వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ఆయా విభాగంలో ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక అభ్యాసనం చేయిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9గంటల వరకు ఒక సబ్జెక్ట్, సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 గంటల వరకు మరో సబ్జెక్టుపై ప్రత్యేక అభ్యాసనం చేయిస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ సారి మెరుగైన ఫలితాల కోసం పట్టుదలతో ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రత్యేక సూచనలు ఇస్తూ ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాల సాధనే ధ్యేయమని నిర్దేశించారు. ప్రభుత్వం ముందే తగినచర్యలు తీసుకోకుండా ఒక్క సారిగా విద్యార్థులపై వత్తిడి తీసుకురావడంపై ఉపాధ్యాయ సంఘాలు గుర్రుగా ఉన్నారు. ఐనప్పటికీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాల కోసం పోటీపడుతున్నారు. దీని కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు వేసుకుంటున్నారు. దీని ప్రకారం ముందుకు సాగుతున్నారు. కేజీబీవీలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. దుద్యాల్ మండలంలో 172 పదోతరగతి విద్యార్థులు ఈ విద్యా సంవత్సరానికి పరీక్షలకు హాజరు కానున్నారు.

ఉత్తమ గ్రేడ్ సాధిస్తా



పాఠశాలలో చదవడంతో పాటు ఇంటివద్ద తెల్లవారుజామునే రివిజన్ చేస్తున్నా. మంచి మార్కులు సాధించి పాఠశాలకు కీర్తి తీసుకురావాలన్న లక్ష్యంతో చదువుకుంటున్నాను. ఉత్తమ గ్రేడ్ సాధించడమే లక్ష్యం.

– ప్రవీణ్, పదోతరగతి, దుద్యాల్

ప్రత్యేక తరగతులు ఉపయోగపడుతున్నాయి



ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉంటున్నాయి. ప్రతీ సబ్జెక్టు టీచర్ అవగాహన కల్పిస్తున్నారు. దగ్గరుండి సలహా, సూచనలు ఇస్తున్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తా. విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఇది చాలా ఉపయోకరంగా ఉంది. ఉపాధ్యాయులు చెప్పినవి శ్రద్ధగా ఆచరిస్తున్నాము.

– హారిక, పదోతరగతి, దుద్యాల్

వెనకబడిన వారిపై దృష్టి



ప్రతీ పాఠశాలలో పదోతరగతి పూర్తి స్థాయి ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు తగ్గట్టుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. ప్రతీసబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మరో సారి వారికి పాఠాలు భోదిస్తున్నాం.

– విజయరామారావ్, హెచ్ఎం దుద్యాల్

రోడ్డు పక్కనే గుంత.. తప్పని చింత!

- ఆందోళనకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ప్రమాద కరంగా ఉన్న గుంత

దుద్యాల్: జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. ఇది హస్నాబాద్–కొడంగల్ మార్గం మధ్యలో ఉంది. ఈ రహదారి గుండా నిత్యం వాహనాలు రద్దీగా ప్రయణం సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో ఎక్కువగా లారీల రాకపోకలు ఉంటాయి. తాండూర్, మహబుబ్‌నగర్ ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో బస్సులు తిరుగుతుంటాయి. వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. అలాంటిది ఇక్కడ ఓ గుంత ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రేపు మోడల్ స్కూల్లో క్విజ్ పోటీలు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలంలోని మోడల్ స్కూల్లో శుక్రవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకుడు లొంక నర్సిములు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఆయా పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ రూ.5వేలు, మూడో బహుమతి రూ.3వేలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నవాబుపేట: నవాబుపేట మండలంలో మంగళవారం రాత్రి నుంచి దావత్‌లు, కేక్ కట్‌చేసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం ఉదయం నుంచి మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్, శివలింగం, వేంకటేశ్వ ఆలయాలకు పూజలు చేశారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

సంతోషంగా ఉండాలి

దోమ: కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుటుంబ సమేతంగా మైలారంలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కొసనం జ్యోతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతపారాయణం

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో గల కిషన్ ప్రభు ఆశ్రమంలో శ్రీకిషన్ ప్రభు గీత ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం గీత పారాయణం, విష్ణు సహస్ర నామాలు, హనుమాన్ చాలీసాను భక్తులు పఠించారు. భోదరంగదాసు ఆధ్వర్యంలో పారాయణంను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు గనికిదేవి సుభాష్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కిషన్ ప్రభు ఆశ్రమ పీఠాధిపతి ఆంజనేయులు, కిషన్ ప్రభు గీత ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యపురెడ్డి, జిల్లా అధ్యక్షుడు రంగదాసు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనసూయ, రంగయ్య, సంతోష్, బాలస్వామి, శ్రీరాములు, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, ప్రమీల, అలివేలు, స్వాతి, అండాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: మండల పరిధిలోని కంకల్ గ్రామంలో బుధవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలదారులు అయ్యప్ప విగ్రహాన్ని ఊరేగించారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామం మారుమ్రోగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ పడిపూజలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, నర్సింలు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: శబరిమలకు తరలివెళ్తున్న స్వాములు

శబరిమలకు తరలిన స్వాములు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటకు చెందిన స్వాములు బుధవారం శబరిమలకు పయనమయ్యారు. ఉదయం గ్రామంలోని హనుమాన్ మందిరంలో ఇరుమడి కట్టుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడితో శబరిమలకు బయలుదేరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయండి

- డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే వినతి



డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గానికి నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రగతి భవన్‌లో ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్, మల్కపహాడ్, కొందుర్గు మండలంలోని మహదేవ్‌పూర్, చెరుకుపల్లి, ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట, చింతగూడ గ్రామాల్లో నూతనంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంను కోరానన్నారు. నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తానన్నారు.

'మార్కెట్ కమిటీ'లో మొయినాబాద్‌కు అన్యాయం

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాములు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ పదవుల పంపిణీలో మొయినాబాద్ మండలానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మోత్కుపల్లి రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మొయినాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల రైతులు కూరగాయలు, పూలను గుడిమల్కాపూర్ మార్కెట్‌కే తీసుకెళ్తారన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌కు అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలానికి మార్కెట్ కమిటీలో చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్‌లో మార్కెట్ యార్డులు ఉన్నాయని, ఆ మార్కెట్ కమిటీల్లో ఆ మండలాల వారికే పదవులు దక్కాయన్నారు. మరోవైపు ఆ మూడు మండలాల నాయకులకే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీలోనూ పదవులు ఇచ్చారని మండిపడ్డారు. మొయినాబాద్ మండలానికి మార్కెట్ కమిటీ లేదని, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీలో అయినా మండలానికి చెందినవారికి పదవులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. డిసెంబర్ 14న సీఎం చిలుకూరు గురుకులానికి వచ్చినప్పుడు సైతం ఎమ్మెల్యే స్థానిక కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే ముమ్ముందు కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి

- చెంగోల్ ప్రాథమిక పాఠశాల ఎదుట బావి
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



చెంగోల్ పాఠశాల ఎదుట కంచెలేని బావి

తాండూరు రూరల్: చెంగోల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఎదుటు చేదబావి ఉంది. గతంలో ఈ బావి నుంచి గ్రామస్తులు నీటిని తోడుకునేవారు. కాలక్రమేణ బావుల వాడకం తగ్గడంతో అది నిరుపయోగంగా మారింది. గతంలో జనవాసాల మధ్య ఉండే బావులకు రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం దీన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. చెంగోల్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఇది ఉంది. వర్షాకాలం వస్తే బావిలో నీరు చేరుతుంది. పాఠశాల ఎదురుగా ఉండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కావున అధికారులు స్పందించి బావికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మురుగు.. పరుగు!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై చేరిన మురుగు నీరు

ధారూరు: నాగసముందర్ గ్రామంలోని వివిధ కాలనీల్లో నిత్యం మురుగు పరుగు తీస్తుంది. ఇదంతా రోడ్డుపై చేరడంతో దోమలు, ఈగలు ఎక్కువై రోగాలు వ్యాపింపజేస్తున్నాయి. ఇళ్లమధ్య రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. కనీసం నడవడానికి వీలు లేకుండా రోడ్డుపై చేరడంతో స్థానికుల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి మురుగుప్రవాహాన్ని అడ్డుకట్ట వేయాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



బొంరాస్‌పేట: అంబేడ్కర్ సంఘం యువకుల నూతన ఉత్సాహం

పరిగి: పట్టణ కేంద్రంతో పాటు ఆయ గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వినోదాలతో యువకులు బాణసంచా కాల్చి కేకులు కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. యువకులు, ఉద్యోగులు ఆయ వర్గాల ప్రజలు ఒకరినొకరు సుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా జరుకున్నారు. పట్టణంలో శ్రీవేంకటేశ్వర స్వామి, లొంకహనుమాన్ దేవాలయాలకు భక్తులు పోటెత్తారు.

ఊరూరా నూతన ఉత్సాహం

బొంరాస్‌పేట: వుండలంలోని గ్రామాలు, తండాల్లో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఘనంగా జరుపుకున్నారు. 2024 ఆంగ్ల సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2025కి స్వాగతం పలికారు. ఎస్ఐ ఎండీ రవూఫ్ ఆధ్వర్యంలో పోలీస్‌బృందం కేక్ కట్‌చేశారు. విద్యార్థులు, యువకులు, గ్రామస్థులు ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రేగడిమైలారంలో అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ సంఘాలు, కొత్త సంవత్సరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిల్లో ఆరాధన కార్యక్రమాలు, ప్రార్థనలు, పాస్టర్ల సందేశాలు వినిపించారు. బొంరాస్‌పేట, మెట్లకుంట, తుంకిమెట్ల, మెట్లకుంట తదితర గ్రామాల్లోని వీధివీధినా డ్యాన్సులు, ఆనందోత్సాహాలతో యువత తేలి ఆడారు.

మహార్‌ల పోరాటం మరువలేనిది



యుద్ధవీరులకు నివాళులర్పిస్తున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు, తదితరులు

సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు ఏర్పుల మల్లేశ్, ఎం.రామస్వామి

చేవెళ్ల: మహార్ యుద్ధవీరుల పోరాటం ద్వారానే అంటరాని కులాలకు విద్యనభ్యసించే అవకాశం కలిగిందని సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు ఏర్పుల మల్లేశ్, ఎం.రామస్వామి అన్నారు. బుధవారం నగరంలోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ మహార్ యుద్ధంలో అమరులైన యుద్ధవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల నుంచి వెళ్లిన సమతా సైనిక్ దళ్ సభ్యులు పాల్గొని ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భీమాకోరేగావ్ యుద్ధం 1818 జనవరి 1వ తేదీన జరిగిందన్నారు. ఈ యుద్ధంలో అమరులైన యుద్ధవీరులకు గుర్తుగా మహారాష్ట్రలోని పూణె నగరంలో భీమా నది ఒడ్డున మహార్ యుద్ధ వీరులకు, విజయానికి గుర్తుగా స్తూపం నిర్మించినట్లు చెప్పారు. మహార్‌ల పోరాటాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచనపల్లి రాంచందర్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్, చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ఆలూరు గ్రామ జై భీమ్ యువజన సంఘం అధ్యక్షులు ఎల్లకొండ నర్సింలు, పూలపల్లి ప్రవీణ్‌కుమార్, పూలపల్లి తరుణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి



ఆలయ సన్నిధిలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి అని దేవాలయాల్లోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు, మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్త సంవత్సరం పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో ఆయన దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామస్తులు కుంభమేళంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నూతన సంవత్సరాన్ని వేడుకగా తీసుకొని కనకమామిడి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నామన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కొండా లక్ష్మికాంత్‌రెడ్డి, నిర్వాహకులు బుచ్చిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన నాయకులు



ఎమ్మెల్యే సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డిని చేవెళ్ల బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. బుధవారం ఆమె నివాసంలో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. అందరూ బాగా కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, తంగెడపల్లి మాజీ సర్పంచ్ రాములు, సత్తయ్య, నాయకులు చందరయ్యగౌడ్ శ్రీపాల్, మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.